ప్రజాశక్తి
శనివారం 2 ఆగస్టు 2025
5
అనంతపురం

రేషన్‌షాపులో పంపిణీని పరిశీలిస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ

సక్రమంగా రేషన్ పంపిణీ జరగాలి

ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరకుల పంపిణీని సక్రమంగా చేపట్టాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ డీలర్లను ఆదేశించారు. శుక్రవారం ఉదయం అనంతపురం నగరంలోని నవోదయ కాలనీలో ఉన్న ప్రభుత్వ చౌకధాన్యపు దుకాణంలో నిత్యవసర సరకుల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డుదారులకు అందరికీ నిత్యావసరాలు ఇవ్వాలన్నారు. రేషన్ షాపుల ముందు పట్టికలో ధరల వివరాలు, స్టాక్‌ను ప్రదర్శించాలని ఆదేశించారు. అనంతరం ఆయన నవోదయ కాలనీలో జరుగుతున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హరికుమార్, విఆర్‌ఒ రామాంజనేయులు పాల్గొన్నారు.

రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌లో ఏర్పాట్లు పూర్తి చేస్తాం

అనంతపురం జెఎన్‌టియులో జరుగుతున్న రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. శుక్రవారం నాడు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ల ఏర్పాటుపై రాష్ట్రంలోని గుంటూరు, వైజాక్, రాజమండ్రి, ఎన్టీఆర్, అనంతపురం, తిరుపతి జిల్లాల జాయింట్ కలెక్టర్లతో విజయవాడ నుంచి ఐటి సెక్రటరీ భాస్కర్ కాటమనేని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అనంతపురం నుంచి ఇన్‌ఛార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి కలెక్టర్ మాట్లాడుతూ అనంతపురం జెఎన్‌టియు అడ్మిన్ బిల్డింగ్‌లో ఏర్పాటు చేస్తున్న రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌లో అవసరమైన పోస్టుల నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఈ మురళీకృష్ణ, డిఈ వి.రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, ఆర్అండ్‌బి జెఈ బాలకాటమయ్య పాల్గొన్నారు.

నివాసేతర గృహాలకు నకిలీ ఈఆర్‌పీ..!

- పన్నుల విధింపులో తారుమారు..!
- 2022 నుంచి 2025 వరకు అక్రమాల బాగోతం
- అనంత కార్పొరేషన్ పరిధిలో తనిఖీలు
- డిఎంఎ తనిఖీలతో వెలుగులోకి అవినీతి వ్యవహారం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం నగరంలోని నివాసేతర గృహాల పన్నుల విధింపులో కొందరు కార్పొరేషన్ అధికారులు నిబంధనలు ఉల్లంఘించారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పన్నుల విధింపునకు సంబంధించి సంబంధిత వివరాలను తారుమారు చేసి, నకిలీ ప్రభుత్వ ఈబిఆర్‌పి మాడ్యూల్ ద్వారా రెవెన్యూ ఆదాయానికి గండి కొట్టిన తీరు ఆలస్యంగా వెలుగు చూసింది. ఇదే విషయంపై గత మార్చి నెలలో అప్పటి డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హరి నారాయణ తనిఖీలు చేసిన సమయంలో ఈ వ్యవహారం వెలుగు చూసింది. దాని పర్యవసానంగా 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 జూన్ 16వ తేదీ వరకు పన్నుల విధింపులో జరిగిన తారుమారులను థర్డ్ పార్టీ బృందాల ద్వారా తనిఖీ చేసేందుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. గత నెల 23వ తేదీ నుంచి వరుసగా మూడు రోజులు పాటు వివిధ మున్సిపాల్టీల నుంచి వచ్చిన రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు అనంతపురం నగరంలో ప్రభుత్వం గుర్తించిన 280 నివాసేతర గృహాలను పరిశీలించారు. ఆయా గృహాల ఇంటి కొలతలు, పన్నులను గుర్తించి వివరాలు సేకరించారు. ఈ పరిశీలనలో నివాసేతర గృహాల పన్నుల విధింపులో అక్రమాలకు పాల్పడి, మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయానికి కొందరు గండి కొట్టిన అంశం వెలుగు చూసింది. ఇందుకు బాధ్యులుగా ఉంటూ అక్రమాలకు పాల్పడిన గత రెవెన్యూ యంత్రాంగానికి నోటీసులు, మెమో జారీ చేసి వివరణ కోరారు. తనిఖీల అనంతరం నివాసేతర గృహాల పన్నుల చెల్లింపు వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన వారందరిపై కఠిన చర్యలు తప్పవనేలా ఉన్నతాధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

గత మార్చి నెలలో మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ హరినారాయణ అనంతపురం మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న బహుళ అంతస్తుల భవనాలను స్వయంగా తనిఖీ చేశారు. భవన నిర్మాణ మంజూరు ఇతర విషయాల్లో కార్పొరేషన్ రెవెన్యూ యంత్రాంగం నిబంధనలను మార్చి అవినీతికి పాల్పడినట్లు గుర్తించారు. నకిలీ ప్రభుత్వ ఈఆర్పీ మాడ్యూల్ ద్వారా ఈ అక్రమాలు రీజియన్‌లోని పలు మున్సిపాల్టీలు, కార్పొరేషన్‌లో జరిగినట్లు గుర్తించారు. ఇప్పటికే కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో ఇందుకు సంబంధించిన తనిఖీలను పూర్తి చేసి నివేదిక సిద్ధం చేశారు. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ ఈఆర్పీ మాడ్యూల్‌కు నకిలీ సృష్టించి అక్రమాలకు పాల్పటినట్లు తనిఖీల్లో తేలడం ప్రభుత్వ వర్గాలను సైతం విస్మయానికి గురి చేస్తోంది. నగరంలో తనిఖీలు నిర్వహించే 20,080 నివాసేతర గృహాల జాబితా వివరాలను ఇటీవల డిఎంఎ కార్యాలయం నుంచి వచ్చింది. ఆ జాబితా మేరకు రెవెన్యూ సిబ్బంది ఇళ్ల కొలతలను బట్టి ప్రభుత్వ నిబంధన ప్రకారం పన్నులు విధించాల్సి ఉంది.

గతంలో అక్రమార్కుల ద్వారా మున్సిపల్ కార్పొరేషన్ రాబడికి గండిపడిన మొత్తాన్ని మదింపు చేసి ప్రత్యేక ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. మూడు సంవత్సరాల క్రితం అవినీతి నిరోధక శాఖ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ రెవెన్యూ విభాగంపై తనిఖీలు నిర్వహించారు. అప్పట్లో ఈ శాఖలో అక్రమాలు జరిగినట్లు అవినీతి నిరోధకశాఖ గుర్తించింది. అక్రమాలకు పాల్పడిన వారిలో 11 మందిని బాధ్యులుగా గుర్తించి నివేదిక సైతం ప్రభుత్వం, ఉన్నతాధికారులకు పంపారు. ఇందులో ముగ్గురు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, ముగ్గురు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లు, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, గుమాస్తాలు ఉన్నట్లు గుర్తించి వారిపై చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఇదే క్రమంలో తాజాగా మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగం డిఎన్ఎ హరినారాయణ తనిఖీల్లో సైతం అవినీతి అక్రమాలు వెలుగు చూడటం గమనార్హం. తాజాగా నగరంలో 280 నివాసేతర గృహాలు, వాణిజ్య సముదాయాలపై తనిఖీలు నిర్వహించి మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్‌కు ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా పూర్తి వివరాలను పంపారు. దీంతో కార్పొరేషన్ రెవెన్యూ విభాగం అధికారుల అక్రమాలు, అవినీతి బాగోతం పెద్ద ఎత్తున వెలుగు చూసే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఉద్యోగ వర్గాల్లో చర్చ కన్పిస్తోంది. ఈ వ్యవహారంపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారన్న దానిపై వేచి చూడాల్సి ఉంది.

లోకేష్‌పై హరీష్‌రావు ఆరోపణలు తగదు : విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కాలవ

తెలంగాణ మాజీ మంత్రి, బిఆర్ఎస్ నాయకుడు హరీష్‌రావు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌పై అర్థం లేని ఆరోపణలు చేయడం తగదని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం కాలవ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వృథాగా సముద్రంలోకి పోయే గోదావరి జలాలను బనకచర్ల ప్రాజెక్టుకు తరలిస్తే తెలంగాణకు అభ్యంతరం ఏంటని మంత్రి లోకేష్ బాబు ప్రశ్నించగా హరీష్‌రావు ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ఆ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రెండు రాష్ట్రాల విశాల ప్రయోజ నాల దృష్ట్యా చంద్రబాబు చేసిన ఆలోచనను తప్పు పట్టడం తగదన్నారు. బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం కలగదని చంద్రబాబు పేర్కొంటుండగా హరీష్‌రావు, బిఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణలోని నెట్టెంపాడు, కల్వకుర్తి, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులు, రాయలసీమలోని గాలేరు నగరి, హంద్రీనీవా సుజల స్రవంతి మిగులు జలాల ఆధారిత ప్రాజెక్టులు కాదా అని ప్రశ్నించారు. సిఎం చంద్రబాబు తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డితో లోపాయికారిగా మంతనాలు జరిపారని హరీష్‌రావు ఆరోపించడం అతడి స్థాయిని దిగజార్చుకోవడమే అన్నారు. చౌక బారు విమర్శలు చేసినా, బనకచర్ల ప్రాజెక్టు విషయాన్ని వివాదం చేసినా ఖబడ్దార్ అని హెచ్చరించారు. కాలవతో పాటు మార్కెట్ యార్డ్ కమిటీ అధ్యక్షులు హనుమంతరెడ్డి, ఉపాధ్యక్షులు దానవేంద్ర పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ప్రభుత్వ విప్

రాయదుర్గం రూరల్ : ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఇంత పెద్దఎత్తున సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తున్న రాష్ట్రం దేశంలోనే ఒక్క ఎపినే అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది పేదలకు ఈ నెల నుంచి కొత్త పింఛన్లు మంజూరయ్యాయన్నారు. మండలంలోని 74-ఉడే గోళం గ్రామంలో శుక్రవారం ఆయన పింఛనుదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లా డు తూ ఈ నెల నుంచి నియోజకవర్గంలో 637 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. వీటి తో మొత్తం 37,050 మందికి రూ. 16.13 కోట్లు ప్రతినెలా పంపిణీ చేస్తున్నామన్నారు. కాలవ వెంట ఎంపిడిఒ కొండన్న, టిడిపి మండల కన్వీనర్ హనుమంతు, మాజీ జడ్పిటిసి విజయ్‌కుమార్ ఉన్నారు.

రూ.కోట్లు కాజేసిన సైబర్ ముఠా అరెస్టు

కాంబోడియా దేశం కేంద్రంగా నకిలీ యాప్‌లో అమాయకులను మోసం చేస్తున్న సైబర్ గ్యాంగ్‌ను అనంతపురం జిల్లా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.43 లక్షల నగదు, సెల్‌ఫోన్, ఇతర సాంకేతిక పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.

వార్త మెయిన్‌లో

రోడ్డు మరమ్మతు చేయించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

కందుకూరు నుంచి రామినేపల్లి హైవే రోడ్డును గుంతలు పూడ్చి పాడైన కల్వర్టుల మరమ్మతులు చేయించాలని సిపిఎం అనంతపురం రూరల్ మండల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం రూరల్ మండల కమిటీ ఆధ్వర్యంలో కందుకూరు గ్రామ సర్పంచి ప్రశాంత్ కుమార్‌ను కలిసి శుక్రవారం నాడు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం అనంతపురం రూరల్ మండల కార్యదర్శి టి.రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, నాయకులు పోతులయ్య, మల్లేష్‌లు హాజరై మాట్లాడారు. కందుకూరు గ్రామం నుంచి జంగాలపల్లి రోడ్డు మీదుగా రాప్తాడు హైవేకు వెళ్లే రోడ్డు గుంతలమయం అయ్యి చాలా అధ్వాన్నంగా ఉందన్నారు. వాహనదారులు ప్రమాదాలకూ గురవుతున్నారని చెప్పారు. రోడ్డు గుంతలు పూడ్చి, కల్వర్టు మరమ్మతులు చేయించాలన్నారు. స్పందించిన సర్పంచి ఎమ్మెల్యే, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శివ కుమార్, వెంకటరాముడు, నారాయణస్వామి, నారాయణరెడ్డి, పెద్దన్న పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ తహశీల్దార్, విఆర్‌ఒలకు సన్మానం

ప్రజాశక్తి- కుందుర్పి

మండల రెవెన్యూ కార్యాలయంలో విధులు నిర్వహించి గత గురువారం ఉద్యోగ విరమణ పొందిన తహశీల్దార్ ఎస్‌పి.శ్రీనివాసులు, విఆర్‌ఒ తిమ్మప్పలను శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని సర్పంచులు, నాయకులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ తహశీల్దార్, విఆర్‌ఒ ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సమర్థంగా ఎదుర్కొని ప్రతి ఒక్కరికీ వీలైనంత వరక న్యాయం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచులు మసాలా జగన్, గంగాధర్, వైసిపి ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు ఎన్.తిప్పేస్వామి, వడ్డే ఆంజనేయులు, ఈరన్న, మసాలా మల్లి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపి సమన్వయకర్త పర్యటన

ప్రజాశక్తి-కళ్యాణదుర్గంటౌన్

నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మాజీ ఎంపి తలారి రంగయ్య శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటిస్తారని ఆ పార్టీ రూరల్ కన్వీనర్ గోళ్ల సూర్యనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ కమిటీల ఎంపికలో భాగంగా ఆయన ముందుగా గోళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పాత చెరువు ఆంజనేయస్వామి ఆలయం వద్ద కార్యకర్తలతో సమావేశం నిర్వహిస్తారన్నారు. సాయంత్రం బోరంపల్లిలో సమావేశం ఉంటుందన్నారు. నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-కుందుర్పి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, సాగునీటి ప్రాజెక్టుల సాధన, విభజన హామీల అమలు కోసం నిరంతరం పోరాడుతామని తాలూకా నూతన అధ్యక్షులు నిజవల్లి బాబు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం వేదికలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమా వేశం నిర్వహించారు. బాబు మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి.రమణ, జిల్లా అధ్యక్షులు ఆకుతోటపల్లి నారాయణరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారన్నారు. వివిధ పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి ఒక కమిటీని వేశారు. వేదిక తాలూకా కమిటీ అధ్యక్షులుగా నిజవల్లి బాబు, ప్రధాన కార్యదర్శిగా వసంత్‌కుమార్, ఉపాధ్యక్షులుగా కృష్ణమూర్తి, నాగరాజు, కార్యదర్శులుగా ములకనూరు గంగాధర్, ఉద్దీప్‌సింహా, చెలిమప్ప, గొర్ల కృష్ణ, ఆలూరి నరేష్, రవిచంద్రారెడ్డిలను నియమించారు.

అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరం

తల్లిపాల ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

బిడ్డకు తల్లిపాలే అత్యంత శ్రేయస్కరమని వైద్యాధికారి రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆయన మండలంలోని పోలేపల్లి గ్రామంలో 3 అంగన్వాడీ కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భిణులకు తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. తల్లి పాలకు ప్రత్యామ్నాయం ఈ ప్రపంచంలో ఏదీ లేదని, ప్రతి తల్లి పుట్టిన అరగంట నుంచి ఆరు నెలల వరకూ తల్లిపాలు మాత్రమే పట్టించాలన్నారు. తల్లిపాలు బిడ్డలకు అంటువ్యాధులు, అసంక్రమిత వ్యాధులను దూరం చేస్తాయని, జీవితాంతం అవసరమైన సంపూర్ణ ఆరోగ్యానికి బాటలు వేస్తాయని తెలిపారు. తల్లి పాలను విస్మరిస్తే ఆరోగ్యాన్ని కాదనుకున్నట్లే అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఈస్టర్ రాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ రామాంజనమ్మ ఎఎన్ఎం మహాలక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు సంతోషమ్మ, అనిత, రేణుక, ఆశా కార్యకర్తలు హనుమక్క, గురుకుల, శిల్ప, పద్మ, మరియమ్మ, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై రాస్తారోకో

ప్రజాశక్తి-రాయదుర్గం

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న బాలగంగాధర్ తిలక్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల వద్ద స్థానికులు రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ కుళాయిల ద్వారా పది రోజులకోసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదిగా తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని వాపోయారు. ఈ విషయమై పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. నీటి పన్ను వసూలుపై ఉన్న శ్రద్ధ నీటిని సరఫరా చేయడంలో లేదన్నారు. విధి లేని పరిస్థితుల్లో ఖాళీ బిందెలతో రాస్తారోకో చేపట్టాల్సి వచ్చిందన్నారు. అక్కడికి చేరుకున్న మున్సిపల్ ఇంజినీర్ సురేష్ నీటి ఎద్దడి గల ప్రాంతంలో ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేస్తామని, నీరు సక్రమంగా రాని సందర్భంలో ట్యాంకర్ల ద్వారా అందిస్తామని తెలిపారు. రాస్తారోకో వల్ల రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. దీంతో ఎస్ఐ రామ్‌ప్రసాద్ పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ జులై 25, 26 తేదీల్లో సంభవించిన ఈదురు గాలుల వల్ల వీరాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లో-వోల్టేజీ కారణంగా మోటార్లు కాలిపోయినట్లు తెలిపారు. వాటిని బళ్లారికి తీసుకెళ్లి మరమ్మతులు చేయించామన్నారు. నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

రాస్తారోకో చేస్తున్న ప్రజలు

సేవా దృక్పథంతో గుర్తింపు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ప్రతి ఒక్కరూ సేవాదృక్పథం అలవర్చుకోవాలని అధికారులు సూచించారు. స్థానిక కళాశాల బాలికల వసతి గృహంలో శుక్రవారం ఉపాధ్యాయురాలు శశికళను సన్మానించారు. ఎంఇఒలు శ్రీధర్, ఓబుళపతి, హెచ్ఎం తిప్పేస్వామి, వార్డెన్ నాగరాజు, రాధ ఆమెను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఉపాధ్యాయురాలు శశికళ పట్టణంలోని ఓ అనాథ మహిళను చేరదీసి సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లారని, మరికొందరిని కూడా ఆదరించారని కొనియాడారు. పేద విద్యార్థులను గురుకుల పాఠశాలలో చేర్పించి ప్రోత్సహించారని ప్రసంశించారు.

రేషన్ బియ్యం ఆరోగ్యానికి శ్రేయస్కరం

ప్రజాశక్తి-బొమ్మనహాల్

ప్రభుత్వం చౌక దుకాణాల ద్వారా అందిస్తున్న రేషన్ బియ్యం ఆరోగ్యానికి శ్రేయస్కరమని తహశీల్దార్ మునివేలు సూచించారు. ఆయన శుక్రవారం మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో ఓ రేషన్ షాపును సందర్శించి డీలర్లు కార్డుదారులకు పంపిణీ చేస్తున్న బియ్యం, స్టాక్, తూకాలను పరిశీలించారు. కాసేపు రేషన్ బియ్యం తీసుకుంటున్న వారితో ముచ్చటించారు. రేషన్ బియ్యం ఆరోగ్యానికి చాలా శ్రేయస్కరమని, ఈ బియ్యంతో భోజనం చేసుకుని తింటే రోగాలు దరి చేరవన్నారు. ఆయన వెంట విఆర్‌ఒ యుగంధర్, విఆర్ఎలు, డీలర్లు, వినియోగదారులు పాల్గొన్నారు

రైతులను మోసగించే వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

విత్తనోత్పత్తి పేరుతో రైతులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు సాకే గురుమూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలోని రూపా ఫర్టిలైజర్స్ దుకాణం వద్ద ఓ కంపెనీ ప్రతినిధి రైతులకు మాయమాటలు చెప్పి విత్తనాలు విక్రయించి చివరకు మోసం చేశారన్నారు. దీంతో శుక్రవారం ఆ దుకాణం వద్ద ఎంఆర్‌పిఎస్ తాలుకా వర్కింగ్ ప్రసిడెంట్ హరి, బాధిత రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఒక్కో రైతు రూ. 70వేలు ఖర్చు చేసి విత్తనోత్పత్తి చేశాక పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. విషయం తెలిసిన వెంటనే ఎడిఎ ఎల్లప్ప సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి సదరు వ్యక్తికి నోటీసులు జారీ చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

నూతన తహశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి-కుందుర్పి

నూతన తహశీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

మండల నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఓబులేష్‌ను శుక్రవారం స్థానిక ప్రజా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి కమలా నాగరాజు, సర్పంచులు గంగాధర్, మసాలా జగన్, మారుతీశ్వరిరామ్మూర్తి, విజయ్‌కుమార్, అతావుల్లా, ఆయకట్టు ఛైర్మన్ రామ్మూర్తినాయుడు, ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులు ఎన్.తిప్పేస్వామి, నాయకులు లింగప్ప, రాజగోపాల్, ఎర్రగుంట ఆనంద్, పెద్దనరసింహప్ప, తదితరులు పాల్గొన్నారు.

కేరళ నన్స్ అక్రమ అరెస్టు తగదు

ప్రజాశక్తి-రాయదుర్గం

కేరళకు చెందిన రోమన్ క్యాథలిక్ నన్స్ వందనఫ్రాన్సిస్, ప్రీతిమేరీ బలవంతంగా మత మార్పిడులు చేయిస్తున్నారని, మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారనే ఆరోపణతో చత్తీస్‌ఘడ్ పోలీసులు గత నెల 25వ తేదీ దుర్గ్ రైల్వేస్టేషన్ వద్ద వారిని అరెస్టు చేయడాన్ని రాయదుర్గం పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోందని అసోసియేషన్ ఉపాధ్యక్షులు జె.కిరణ్‌కుమార్ తెలిపారు. చత్తీస్‌ఘడ్‌లో ఉన్న వారు ఇది వరకే క్రైస్తవులు కాగా వారిని బలవంతంగా మతమార్పిడులు ఎలా చేస్తారని ప్రశ్నించారు. దేశంలో మైనారిటీలపై అరాచకాలు ఆపాలని, పోలీసులు అక్రమంగా అరెస్టు చేసిన నన్స్‌తో పాటు స్థానిక యువతి సుఖమాన్ మాండలిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

5న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఈ నెల 5వ తేదీ పట్టణ సమీపంలోని బోరంపల్లి పాలిటెక్నికల్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ల ద్వారా ఖాళీ సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపల్ తిప్పేస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 4వ తేదీ విద్యార్హత, పాలి సెట్ ర్యాంకు కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను కళాశాలలో అందజేయాలన్నారు. ఫీజు రూ. 5,800 చెల్లించాల్సి ఉంటుంద న్నారు. స్పాట్ అడ్మిషన్‌లో సీట్లు పొందే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ వర్తించవని తెలిపారు. మరిన్ని వివరాలకు 950 550 4207, 9989 6500 49, 9346 40 2280 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

మౌలిక వసతులపై పరిశీలన

ప్రజాశక్తి-తాడిపత్రి

ప్రజలను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్

మున్సిపల్ కమిషనర్ ఎస్.శివరామకృష్ణ శుక్రవారం స్థానిక గాంధీనగర్-1 సచివాలయ పరిధిలో క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల కల్పనపై పరిశీలించారు. ఇందులో భాగంగా కమిషనర్‌తోపాటు వివిధ శాఖల అధికారులు నేరుగా నివాసితుల వద్దకు వచ్చి ముఖాముఖి మాట్లాడుతూ సమస్యలు, అభిప్రాయాలు, మౌలిక సదుపాయాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా కొన్ని ఇళ్ల వద్ద రెసిడ్యుయల్ క్లోరిన్ శాతం పరీక్షించగా, తాగునీటి నాణ్యత సంతృప్తికరంగా ఉందని అధికారులు ధృవీకరించారు. అయితే ప్రజల నుంచి కమ్యూనిటీ వాటర్ ట్యాంకు మరమ్మతు, నూతన తాగునీటి కొళాయిలు, వీధి లైట్లు, వివిధ పెన్షన్ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. వెంటనే స్పందించిన కమిషనర్ ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే చెత్త సేకరణ, లిఫ్టింగ్ ఆలస్యం ఏ ప్రదేశాల్లోనైతే ఉందో వెంటనే పరిష్కరించాలని సూచించారు. కొన్నిప్రాంతాల్లో కుక్కలు, పందులు, పశువుల బెడదపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఇదే సమయంలో గ్రీన్‌బెల్ట్ అభివృద్ధికి మరింత అవకాశాలు ఉన్నాయని గుర్తించారు. త్వరలో ఎంఇపిఎంఎ మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసి మహిళా స్వయం సహాయక సంఘాలకు జీవనోపాధిగా మారేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

హామీల అమలులో చంద్రబాబు విఫలం

ప్రజాశక్తి-పుట్లూరు

ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో సిఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని వైసిపి మండల కన్వీనర్ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని గరుగు చింతలపల్లి, కోమటికుంట్ల గ్రామాల్లో 'బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లికూటమి ప్రభుత్వ మోసపూరిత హామీలను వివరిస్తూ క్యూఆర్ కోడ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నరసింహులు, జెసి రామాంజనేయులు, నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సాంబశివారెడ్డి, విష్ణువర్ధన్, నరేంద్రరెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మనోహర్, ఓబిరెడ్డి పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని కోటవీధిలో వైసిపి మండల కన్వీనర్ బాల రమేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం 'బాబు షూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వైసిపి నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ మోసపూరిత హామీలను వివరిస్తూ క్యూఆర్ కోడ్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, కరుణాకర్, చాంద్‌బాషా, నాగేంద్ర, సోమశేఖర్, శ్రీనివాసులు, భార్గవ్, తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-గుత్తి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

మున్సిపాలిటీ పరిధిలోని జెడ్.వీరారెడ్డి కాలనీకు ప్రధాన రహదారి నిర్మించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌కు సిపిఎం, ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జంగాల కాలనీలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల మాట్లాడుతూ పట్టణ శివారులో పేదలకు రెవెన్యూ అధికారులు నివేశన స్థలాలు ఇవ్వడంతో ఇల్లు నిర్మించుకున్నారని చెప్పారు. కాలనీ ఏర్పాటై 17 ఏళ్లు గడిచిన ప్రధాన రహదారి లేదన్నారు. కాలనీకి రహదారి లేకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాలనీవాసులు గుంతల రహదారిలో ప్రమాదవశాత్తు కిందపడి ప్రమాదాలకు గురయ్యారని చెప్పారు. ఇప్పటికైనా స్పందించి జెడ్.వీరారెడ్డి కాలనీకు సిసి రహదారి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల అధ్యక్షురాలు రేవతి, డివైఎఫ్ఐ అధ్యక్షుడు అశోక్, నాయకులు హరి, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా గడువు పెంచాలి

ఉరవకొండ : పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈనెల 15వతేదీ వరకూ గడువు పెంచాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటల బీమా ప్రీమియం చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతనెల 31వతేదీతో గడువు ముగిసిందన్నారు. అయితే ఆన్‌లైన్‌లో గత వారంరోజుల నుంచి మీసేవా సెంటర్ల వద్ద పడిగాపులు కాసినా అనేక కారణాలతో రైతులు బీమా ప్రీమియం చెల్లించలేకపోయారన్నారు. రైతులు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైతాంగం కోసం ఈనెల 15 వరకు గడువు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, వెంకటేశులు, మండల నాయకులు సుంకన్న, రైతు సంఘం మండల నాయకులు సీనప్ప పాల్గొన్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి

శింగనమల : బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం గ్రామం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌ఆర్‌ఐటి)లో రోటరాక్ట్ క్లబ్ ఇనిస్టాలేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రోటరీ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ ఎలెక్ట్ రత్న పి.కేశవరెడ్డి, అడ్వాన్స్‌డ్ సైకాలజికల్ సర్వీసెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షురాలు కె.భార్గవిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ గుణాలు, సేవా మనోభావం పెంపొందించుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు ప్రోత్సాహం అందిస్తాయన్నారు. అనంతరం రోటరాక్టర్ నూతన అధ్యక్షునిగా వి.హర్ష (సివిల్ ఇంజినీరింగ్), కార్యదర్శిగా ఎన్.గంగాధర్ (ఇఇఇ) బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రోటరాక్ట్ క్లబ్ కో ఆర్డినేటర్లు పి.వెంకటసునీల్, పి.నాగలక్ష్మి, టి.కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మీనారాయణ, 120 మంది విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎఫ్ఎ పరీక్షలు వాయిదా

అనంతపురం సిటీ : ఈనెల 4వతేదీ నుంచి నిర్వహించాల్సిన ఫార్మేటివ్ అసెస్మెంట్స్ పరీక్ష-1 (ఎఫ్ఎ-1)లను వాయిదా వేస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, జిల్లా సాధారణ పరీక్షమండలి కార్యదర్శి గంధం శ్రీనివాసులు శుక్రవారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఎస్‌సిఆర్‌టి డైరెక్టర్ వెంకట కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకూ తిరిగి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని, ఉప విద్యాశాఖ అధికారులు, అన్ని మండల విద్యాశాఖ అధికారులకు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, ఆశ్రమ పాఠశాలల యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు పరీక్షల మార్పును గుర్తించాలని కోరారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

గుత్తి : మండలంలోని జక్కలచెరువు గ్రామంలోని సచివాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు, టిడిపి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, ఎంపిడిఒ డి.ప్రభాకర్, సర్పంచి యు.రామలింగమయ్య, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణమ్మ, టిడిపి నాయకులు వెంకటనారాయణ, చికెన్ శీనా, న్యాయవాది సోము, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి ఆధ్వర్యంలో శుక్రవారం పేద కుటుంబానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న అనంతపురంలోని సంగమేష్‌నగర్‌కు చెందిన నగేష్, వనజ కుటుంబానికి రెండు నెలలకు సరిపడా 36 రకాల నిత్యావసర సరుకులను నివాసంలో అందించారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT BALLARI
Regular Appeal No. 31/2023
Between:
Munna Bee and others ...**Appellant**
AND
R.Chandrashekar and others ...**Respondents**
NOTICE TO THE RESPONDENT NO. 2
To,
R2: Lakshmi Devi W/o. late Anjineya, aged about 67 years, R/o. Konakondla village, Gooty Taluk, Ananthapur District, A.P.
Whereas the above named appellant has filed the above appeal against the judgment and decree passed by the trial court in O.S.No. 219/2015 on the file of Principal Civil Judge and JMFC, Ballari. Therefore, you are hereby, directed to appear in this Court in person or by a Pleader duly instructed on 24 day of September 2025 at 11.00 A.M before this Court to answer the claim in your defence and also, to produce on the said day all the document in your possession, failing which the appeal will be heard and determined.Given under my hand and seal of the Court on this 30th day of July, 2025.
(By Order of the Court)
R.Huliraj, Advocate for the Appeallants
C.M.O Prl. Senior Civil Judge, Bellari

పంట నమోదు పరిశీలన

పుట్లూరు : మండలంలోని అరకటవేముల గ్రామంలో శుక్రవారం చేపట్టిన పంట నమోదును జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రఘునాథ్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే పదెకరాల్లోపు ఉన్న రైతులకు 90శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఇఒ రామాంజనేయులు, విహెచ్ఎ రష్మిత, రైతులు పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలిస్తున్న అధికారులు

ప్రపంచీకరణను దాటుకుని కవిత్వం రాయాలి

ప్రజాశక్తి-అనంతపురం

తెలుగు వెలుగు సభలో ఆచార్య రాచపాలెం

కవులను సన్మానిస్తున్న అతిథులు

వర్తమాన కవి ప్రపంచీకరణను దాటుకుని కవిత్వం రాయాలని ఆచార్య డాక్టర్ రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం నగరంలోని కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు టివి రెడ్డి నిర్వహణలో ఉమ్మడిశెట్టి సాహితీ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ రాధేయ అధ్యక్షతన సంస్థ 5వ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు కవులు, కళాకారులు, పాత్రికేయులు, స్వచ్ఛంద సేవకులను ఘనంగా సత్కరించారు. తర్వాత టివి రెడ్డి 'అమరమ్' కవితా సంపుటిని ఆర్టీసీ సీనియర్ కార్మిక నాయకులు జి సంజీవులు ఆవిష్కరించారు. మొదటి ప్రతిని సీనియర్ కార్మికుడు యం.సుబ్బరంగయ్య అందుకున్నారు. గద్వాల సోమన్న 'కాంతి కిరణాలు' పుస్తకాన్ని అమరనాథరెడ్డి, పలకలూరి శివరావు 'ఎడారి ఓడ' పుస్తకాన్ని ఏలూరు యంగన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచకరణ నుంచే అన్నివాదాలు ఏర్పడ్డాయన్నారు. కావున కవి చాలా జాగ్రత్తగా వర్తమాన వాదాలను పట్టుకుని కవిత్వం రాయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవులు, రచయితలు బండి నారాయణస్వామి, డాక్టర్ శాంతి నారాయణ, డాక్టర్ తూముచెర్ల రాజారాం, ఉప్పరపాటి వెంకటేశ్వర్లు, కొత్తపల్లి సురేష్, జెట్టి జయరామ్, మధుర శ్రీ, రియాజుద్దీన్, నాగముని, సంస్థ కార్యదర్శులు కె.అల్తాఫ్, బెల్లంకొండ రాధిక, కె.సుబ్బరాయుడు, కోశాధికారి కెఒఆర్ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సిఎం చంద్రబాబుతోనే సుపరిపాలన

ప్రజాశక్తి-గుత్తి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

సిఎం నారా చంద్రబాబు నేతృత్వంలోని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపరిపాలన అందిస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 17, 18వ వార్డుల్లో టిడిపి పట్టణ కన్వీనర్ ఎంకె.చౌదరి, సాగునీటి సంఘం అధ్యక్షులు ఎన్.కేశవనాయుడు ఆధ్వర్యంలో 'సూపరిపాలనలో తొలిఅడుగు' నిర్వహించారు. ఇందులో భాగంగా టిడిపి జిల్లా అధ్యక్షులు జి.వెంకటశివుడు యాదవ్, మండల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదల కోసం సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సామాజిక పింఛన్లు ఒకేసారి పెంచేసి లబ్ధిదారులకు అందజేసిన ఘనత సిఎం నారా చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తల్లికి వందనం,ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంతో తోపాటు పలు పథకాలను ప్రవేశపెట్టి సీఎం చంద్రబాబు ప్రజా మన్నలను పొందుతున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు జిల్లాలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ బి.జబ్బార్‌మియా, డిఇ.హేమచంద్ర, మెప్మా సిఒ చంద్రశేఖర్, సర్పంచి పి.భరత్‌కుమార్, టిడిపి పట్టణ, మండల కార్యదర్శులు మారుతీప్రసాద్, సాంబశివయాదవ్, నాయకులు ఎస్ఎం బాషా, చికెన్ శీనా, బి.రమేష్, ఆర్.సొలమన్‌రాజా, సి.లక్ష్మణ్‌చౌదరి, కోనంకి కృష్ణ, ఎ.గోవర్ధన్, డేగ మద్దిలేటి, ఎం.నాగరాజు, నంద్యాల రమేష్, జనసేన నాయకులు పాటిల్ సురేష్, అశ్వ నాగప్ప, బోయగడ్డ బ్రహ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

'జలకన్య'కు విశేష ఆదరణ

జిల్లావాసులను అలరిస్తున్న ఎగ్జిబిషన్- నిర్వాహకులు శ్రీనివాసులు అంజుమ్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ఇన్‌సెట్‌లో జలకన్య విన్యాసం

ఎగ్జిబిషన్‌కు తరలివచ్చిన జనం

నగరంలోని రుద్రం పేట వద్ద ఏర్పాటు చేసిన జలకన్య ఎగ్జిబిషన్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. ఈ సందర్భంగా నిర్వాహకులు శ్రీనివాసులు అంజుమ్ మాట్లాడుతూ జిల్లాలో ఇదివరకు ఎవరూ ఏర్పాటు చేయని వినోదాత్మకమైన సరికొత్త అమ్యూజ్మెంట్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రత్యేక ఆకర్షణగా జలకన్య విన్యాసాలు అందరినీ ఆకట్టుకుంటున్నాయని వివరించారు. ముఖ్యంగా ఎగ్జిబిషన్‌లో అతిపెద్ద జాయింట్ విల్, సొలంబో, బ్రేక్ డాన్స్, డ్రాగన్ ట్రైన్ వంటి అమ్యూజ్మెంట్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళలు పిల్లల కోసం గర్ సంసార, దుస్తుల స్టాళ్లు, స్నాక్స్ తినుబండారాలు వినోదాత్మకమైన షోలు అన్ని రకాల వస్తువులు ప్రజలకు ఆహ్వానం పలుకుతున్నాయన్నారు. కుటుంబ సమేతంగా మూడు గంటలపాటు సంతోషంగా గడిపేందుకు ఎగ్జిబిషన్ను తీర్చిదిద్దినట్లు చెప్పారు. ముఖ్యంగా రెండు టన్నెళ్ల ద్వారా ఏర్పాటు చేసిన ఆక్వేరియంలో ఏర్పాటు చేసిన చేపలు చూసేందుకు పిల్లలు, పెద్దలు పెద్దఎత్తున తరలిరావడం సంతోషకరంగా ఉందన్నారు. అంతేగాకుండా ఎగ్జిబిషన్‌లో సకల సౌకర్యాలు కల్పించినట్లు చెప్పారు. ముఖ్యంగా మహిళలకు ప్రత్యేక మరుగుదొడ్లు, విశ్రాంతి ప్రదేశాలు, కరెన్సీ కోసం ఫోన్‌పే వంటి సదుపాయం వంటి సౌకర్యాలను కల్పించినట్లు చెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పుట్టిన బిడ్డకు ముర్రుపాలు శ్రేష్ఠం

ప్రజాశక్తి-నార్పల

తల్లిపాల వారోత్సవాల్లో వక్తలు

పుట్లూరులో పాల్గొన్న అంగన్వాడీలు, చిన్నారులు

అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టించడం ద్వారా పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని పలువురు వక్తలు అన్నారు. సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని సుల్తాన్ పేట-2, ఉయ్యాలకుంట, గూగూడు, శోదనపల్లి గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా సూపర్‌వైజర్ నారాయణమ్మ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు పటిస్తే బిడ్డకు మొదటి టీకాలా పని చేస్తుందన్నారు. అంతేగాకుండా తల్లికి అనేక ఉపయోగాలు ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో గూగూడు సర్పంచు రమణకుమారి శివయ్య, అంగన్వాడీలు రేణుకాదేవి, శ్రీదేవి, నాగమణి, పార్వతి, ఆదినారాయణమ్మ, సిహెచ్ఒ హేమలత, ఎంపిహెచ్ఎస్ అనసూయమ్మ, ఎఎన్ఎం వనిత, ఎంఎల్‌హెచ్‌పి అరుణ, హెల్పర్లు పద్మజ, అంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని అంగన్వాడీ సెంటర్‌లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లావణ్య ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 1 నుంచి 7వతేదీ వరకూ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పద్మావతి, పార్వతి, ఉమా, సుశీల, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : మండలంలోని వేములపల్లి, తిమ్మంపల్లి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రాజమణి శాంతమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా తల్లిపాల విశిష్టతపై వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండల కేంద్రంలోని సంత మార్కెట్, సుదర్శన్ టాకీస్ అంగన్వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాల నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు, తల్లులు, గర్భిణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ, అంగన్వాడీ టీచర్లు రెహనాజ్‌బేగం, అనిత, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

ఉరవకొండ : తల్లిపాలతోనే చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నింబగల్లు గ్రామం 1వ అంగన్వాడీ సెంటర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, మహిళా పోలీస్ అపర్ణ, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, అంగన్వాడీ కార్యకర్తలు రామాంజనమ్మ, ఈశ్వరీదేవి, శ్రీదేవి, ఆశావర్కర్ ఉమాదేవి, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో సిడిపిఒ యల్లమ్మ, సూపర్‌వైజర్ రమాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్వాడీ సిబ్బంది, చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమమలో ఎఎన్ఎం సునీత, అంగన్వాడీలు పాల్గొన్నారు.

టిడిపి నాయకుని మృతికి నివాళి

బెలుగుప్ప: అనారోగ్యంతో మృతిచెందిన మండల పరిధిలోని ఆవులెన్న గ్రామానికి చెందిన టిడిపి నాయకులు గోనుగుంట్ల శంకర్‌నారాయణ మృతికి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈయన సర్పంచుగా, సింగిల్‌విండో అధ్యక్షునిగా పని చేశారు. దీంతో పలువురు నాయకులు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు

పామిడి : మండలంలో ఎవరైనా ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి విజయకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మండలంలోని రైతులు వరి నాట్లు వేసేటప్పుడు నారు కొనలు తుంచి నాటు వేసుకోవాలని సూచించారు. అలాగే నారును సూడోమోనాస్ ద్రావణంతో శుద్ధి చేసుకోవాలన్నారు. త్వరలోనే సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాలకు యూరియా, డిఏపి వస్తుందన్నారు.

బిల్లుల్లేని బంగారం స్వాధీనం

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

బంగారాన్ని చూస్తున్న పోలీసులు

బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.1.123 కిలోల బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. తాడిపత్రి రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డికి వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం తెల్లవారుజామున అనంతపురం-తాడిపత్రి ప్రధాన రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ వద్ద సిబ్బందితో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో అనంతపురం నుంచి వచ్చిన కారును ఆపి తనిఖీ చేశారు. ఇందులో సుమారు రూ.1.123 కిలోల బంగారాన్ని బిల్లులు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. బంగారానికి సంబంధించిన బిల్లులు చూపాలని అడగ్గా కారులో ఉన్న వ్యక్తి ఎలాంటి బిల్లులు లేవని చెప్పాడు.దీంతో బంగారానికి పంచనామా చేసి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్య నిమిత్తం కమర్షియల్ టాక్స్ అధికారులకు అప్పగించామని పోలీసులు తెలిపారు. ఇందులో పట్టుబడిన వ్యక్తి పేరు చెప్పకపోవడం గమనార్హం. ఇకపోతే రూరల్ పోలీసులు విలేకరుల సమావేశం రహస్యంగా నిర్వహిస్తున్నారా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అనంతపురం రూరల్ మండలం పాపంపేట పంచాయతీ, రామాలయం వీధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ముగ్గురు సోదరులకు కానిస్టేబుల్ ఉద్యోగాలు

ప్రజాశక్తి-గుత్తి

ఉద్యోగాలకు ఎంపికైన అన్నదమ్ములు

పట్టణానికి చెందిన ఒకే కుటుంబంలో ముగ్గురు అన్నదమ్ములకు కానిస్టేబుల్ ఉద్యోగాలు దక్కాయి. జెండా వీధికి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మహబూబ్‌దౌలా కుమారులు కుమారులు మహమ్మద్ అలీ, మహమ్మద్ గౌస్, మహమ్మద్ సమీర్ శుక్రవారం ప్రభుత్వం విడుదల చేసిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఎంపికయ్యారు. ఒకే కుటుంబంలో ముగ్గురు సోదరులు పోలీస్‌శాఖలో ఎంపిక ఎంపిక కావడం విశేషం. కాగా ప్రస్తుతం ఆ కుటుంబం ఉద్యోగరీత్యా అనంతపురంలో స్థిరపడింది.

శింగనమలలో ఆరుగురు..

శింగనమల : ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాల్లో మండలానికి చెందిన ఐదుగురు అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. మండలానికి చెందిన ముంతా కిషోర్‌కుమార్, భూమిరెడ్డి శ్రీలక్ష్మి, చిన్నజలాలపురం గ్రామానికి చెందిన రాజేశ్వరి, దండు ఉమాదేవి, బండి నరేష్, రాజ్‌కుమర్ సివిల్ కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారివారి గ్రామాల్లో తల్లిదండ్రులు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు.

బెలుగుప్ప : మండల పరిధిలోని యలగలవంక గ్రామానికి చెందిన గొల్ల రాఘవేంద్ర పోలీస్ ఉద్యోగం సాధించాడు. ప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాలో గ్రామానికి చెందిన రైతు గొల్ల చంద్రన్న, జయమ్మ కుమారుడు జి.రాఘవేంద్ర ఉద్యోగానికి ఎంపికయ్యాడు.

ముందుగా గుర్తిస్తే టిబి నివారణ సాధ్యమే

పెద్దపప్పూరు : ముందుగానే టిబి వ్యాధిని గుర్తిస్తే మందులు వాడి పూర్తిగా నయం చేసుకోవచ్చని వైద్యులు ప్రీతి సూచించారు. శుక్రవారం మండలం పరిధిలోని ముచ్చుకోట గ్రామంలో 104 ద్వారా టిబి వ్యాధి గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే దాత నగరూరు ఉపాధ్యాయులు రవికుమార్ సహాయంతో ఇద్దరికి టిబి వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టిఎస్ బి.సునీల్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ శర్మాష్‌వలి, ఆరోగ్య కార్యకర్త సుధాకర్, జ్యోతి, స్థానికులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

యాడికి : పరిసరాల పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ అవగాహనతో మెలిగి శుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు పరమేశ్వర్, సాయిసుమంత్‌రెడ్డి, తాడిపత్రి మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేల్ సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్‌గౌడ్, ఎఎన్ఎం విజయ, మేరీ, మేల్ హెల్త్ అసిస్టెంట్ శరత్, ఆశా కార్యకర్తలు సులోచన, సుబ్బలక్ష్మి, సునీత, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ రూములు స్వాధీనం

నార్పల : బకాయిలు చెల్లించని పంచాయతీకి సంబంధించిన రూములను అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలోని కొన్ని రూములకు యజమానులు కొన్నేళ్ల నుంచి అద్దెలు చెల్లించలేదు. దీంతో డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, కార్యదర్శి శ్యామల ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు మధ్య రూములకు తాళాలు వేసి స్వాధీనం చేసుకున్నారు..

తాగునీటి సమస్యపై ఆరా..

నార్పల : గత కొద్దిరోజులోగా మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యలపై ఎంపిడిఒ మమతాదేవి పరిశీలించారు. బోర్లు ఎండి గ్రామంలో తీవ్ర నీటి సమస్య ఉందని గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో స్పందించినె ఎంపిడిఒ అధికారులతో కలిసి శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులను తాగునీటి సమస్యపై ఆరాతీశారు. గ్రామంలో ఉన్న బోర్లలోనే జియాలజిస్ట్ ద్వారా పరిశీలించి తిరిగి బోర్లు వేసి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ జనార్ధన్, సర్పంచు వెంకట నారాయణమ్మ, కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగి రవికిరణ్‌కు ఉద్యోగోన్నతి

గుత్తి : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బి.రవికిరణ్‌కు మేనేజర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. దీంతో కోనసీమ జిల్లా మండపేట మున్సిపాలిటీకి బదిలీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రవికిరణ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, ఆర్ఓ సతీష్, టీపీఎస్ మారుతీప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైల్వే క్వార్టర్స్‌లో చోరీ

రాయదుర్గం : పట్టణంలోని రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగి నాగేంద్ర ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. నాగేంద్ర ఇటీవలే పాత క్వార్టర్స్ నుంచి కొత్త క్వార్టర్స్‌లోకి ఇల్లు మారాడు. కొంత లగేజీ కొత్త ఇంట్లోకి తరలించారు. కొత్త క్వార్టర్స్‌లో ఇంటికి తాళం వేసి పాత ఇంట్లో పడుకున్నారు. కొత్త ఇంట్లో చోరీ జరిగినట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్న నాగేంద్ర అక్కడికి వెళ్లి పరిశీలించారు. దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి 30 గ్రాముల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి ఆభరణాలు, దేవుని హుండీలోని నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. చోరీ అయిన వస్తువులు, నగదు కలిపి రూ. 5 లక్షలు ఉంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా రైల్వే క్వార్టర్స్ సమీపంలో సాయంత్రమైతే మద్యం బాబుల బెడద అధికంగా ఉందని స్థానికులు ఆరోపించారు.